జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనలో..

కూచిపూడి నృత్య ప్రదర్శనలో జాతీయ స్థాయిలో శ్రీ దీక్షిత మొదటి బహుమతిని సాధించింది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగనపహాడ్‌కు చెందిన తలారి శ్రీ దీక్షిత హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొని మొదటి బహుమతిని సాధించడంతో అమె తల్లిదండ్రులతో పాటు స్థానికులందరూ అభినందించారు.- బండ్లగూడ

పబ్‌లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్ వద్ద తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వెంగళరావునగర్, ఆగస్టు 11:జూబ్లీహిల్స్‌లోని తబులా రాసలో శనివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పబ్‌లో ఉన్న వారిని పరీక్షించి నమూనాలను సేకరించారు. 20 మందిని పరీక్షించగా ఎలాంటి మత్తు పదార్థాలు సేవించలేదని తేలింది. ఈ తనిఖీలు అన్ని సముదాయాల్లో కొనసాగుతాయని..మాదక ద్రవ్యాలు సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ రావు హెచ్చరించారు.

ప్రజా మరుగుదొడ్లు..ఇలా..!

డోర్లు,ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లిన దుండగులు

- కార్మికుల కోసం నిర్మించిన టాయిలెట్స్
- లోపించిన అధికారుల పర్యవేక్షణ
- వృథాగా లక్షల రూపాయలు
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 11: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ పబ్లిక్ టాయిలెట్స్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నిరుపయోగంగా మారాయి. ఎలాంటి సదుపాయాలు లేక పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని అప్రయోజనంగా తయారయ్యాయి. జీహెచ్ఎంసీ పబ్లిక్ టాయిలెట్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో పాటు అందులో ఉన్న సామగ్రిని ఎత్తుకెళ్లారు. డోర్స్, నీటి పైపులు, నల్లాలు, వాటర్ ట్యాంకులను ఎత్తుకెళ్లడంతో అవి పూర్తిగా ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో టాయిలెట్స్‌ల నిర్వహణను పట్టించుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటి నిర్వహణపై స్థానికులు పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఏ ఒక్కరూ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రజాధనం వృథా...

జీహెచ్ఎంసీ అధికారులు ప్రజల సౌకర్యం కోసం లక్షలు వెచ్చించి పబ్లిక్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో ఇవి మూణాళ్ల ముచ్చటగా మారిపోయాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజలు బతుకుదెరువు కోసం వచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. కాటేదాన్ పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో కార్మికులుగా అనేక మంది పనులు చేస్తుంటారు. అలాంటి కార్మికుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీటిని నిర్మించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటి నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు.

కాటేదాన్ ప్రాంతంలో జీహెచ్ఎంసీ పబ్లిక్ టాయిలెట్స్‌కు డోర్స్ లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న దృశ్యం

త్వరలో అందుబాటులోకి తెస్తాం

కాటేదాన్ పారిశ్రామికవాడ ప్రాంతంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇండస్ట్రీరియల్ ఏరియాలో పని చేస్తున్న వారు ప్రజలు అధికంగా ఉంటారు. ఈ ప్రాంతంలో ప్రజల కోసం పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించాం. కానీ కొందరు గుర్తు తెలియని వ్యక్తులు డోర్స్ ఎత్తుకెళ్లడంతో పాటు సామగ్రిని ధ్వంసం చేశారు. వీటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రజా అవసరాలను గుర్తించి మరింత మెరుగైన సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

రవికుమార్, -రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

నారాయణగూడ మార్వేల్‌లోని ఫంక్షన్ హాల్‌లో మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నారాయణగూడ సీఐ చంద్రశేఖర్

హిమాయత్‌నగర్,ఆగస్టు11: గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపు కోవాలని నారాయణగూడ పీఎస్ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ నిర్వాహకులకు సూచించారు. ఆదివారం నారాయణగూడలోని మార్వేల్ ఫంక్షన్‌హాల్‌లో మైత్రీ, మండపాల నిర్వాహకులతో సమావేశమై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల కోసం అనుమతి తీసుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు నిర్వాహకులు చొరవ తీసుకోవాలన్నారు. మండపాల వద్ద అభ్యంతరకరమైన పాటలు, ప్రకటనలు చేయకుండా భక్తి పాటలను రాత్రి 10 గంటల వరకు మాత్రమే పెట్టుకోవాలన్నారు.

మండపాల వద్ద రాత్రి సమయంలో తప్పని సరిగా నిర్వాహకులు అందుబాటులో అందుబాటులో ఉండాలని తెలిపారు. మండపాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతితో పాటు ఐడీ నంబర్లను కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీఐ నాగార్జున ఎస్సైలు నరేష్‌కుమార్,షఫీ,శిరీష, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా అభియాన్..

స్వాతంత్య అమృత మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుభ్రం చేశారు. ప్రతిఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి,దేశభక్తిని చాటాలన్నారు. ఈ నెల 13న పంజాగుట్ట నుంచి లిబర్టీ వరకు నిర్వహించే తీరంగా యాత్ర బైక్ ర్యాలీలలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. -హిమాయత్‌నగర్,ఆగస్టు11

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం

జూబ్లీహిల్స్ డివిజన్ దుర్గా భవానీ నగర్ ఫేజ్-1 లో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

వెంగళరావునగర్, ఆగస్టు 11: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండు గ ప్రతిబింబిస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లోని దుర్గాభవానీ నగర్ ఫేజ్-1 బస్తీలో ఈదమ్మ-ఎల్లమ్మ ఆలయంలో శ్రావణ మాసం తొలి ఆదివారం సందర్భంగా బోనాల వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. బస్తీ వాసులంతా ఒకేసారి అమ్మవారికి బోనాల సమర్పించారు.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు, వంశీకృష్ణ,బస్తీ అధ్యక్షుడు వేముల జగన్, ఓర్సు శ్రీను, కుమార్ గోపి, మహేష్,కరుణాకర్ పాల్గొన్నారు.

వష్టి కథా సంపుటి పరిచయం

ముషీరాబాద్, ఆగస్టు 11: విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో సిటీ కల్చరల్ సెంటర్‌లో ప్రముఖ రచయిత్రి శైలజా మిత్ర రచించిన జన్మంచడమే కవిత్వం, వష్టి కథా సంపుటి పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఆర్. దేవణ్ణ పాల్గొని పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జెల్లి విద్యాధర్,, బిక్కి కృష్ణ, ప్రొఫెసర్ జీవీ రత్నాకర్, సరికొండ నరసింహరాజు, మంజుల సూర్య, డాక్టర్ రాధా, శైలజా మిత్రా పాల్గొన్నారు.

సబ్‌జూనియర్ విషూ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

గోల్నాక; ఆగస్టు 11: హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల సబ్ జూనియర్ విషూ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి.ఆదివారం అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో జీహెచ్ఎంసీ మాజీ స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రేమ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చంద్రయ్యగౌడ్, సద్గురు, ఆనంత్, సతీశ్ పాల్గొన్నారు.

గంగపుత్రుల సంక్షేమానికి కృషి



గంగపుత్ర సంఘం భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, ఆగస్టు 11 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో నూతనంగా నిర్మించిన అంబర్‌పేట గంగపుత్ర సంఘం భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. దీనికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి. రామస్వామి, చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కూన సుధాకర్, ఇతర కమిటి సభ్యులు పాల్గొన్నారు.

గోల్నాక : అంబర్‌పేట నియోజకవర్గంలోని గంగపుత్రుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తున్నాని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ గంగానగర్‌లో కొత్తగా నిర్మించిన మండేపల్లి గంగపుత్ర సంఘం కమ్యూనిటీహాల్ భవనాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు మేలు జరిగిందన్నారు. అన్ని కులాలకు కేసీఆర్ ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో మండేపల్లి గంగపుత్ర సంఘం ప్రతినిధులు కాశీరాం, సందరి శ్రీనివాస్,యాదగిరి, ప్రవీణ్ కుమార్, సింగీతం సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం కమ్యూనిటీహాల్ ప్రారంభం

గోల్నాక డివిజన్ గంగానగర్‌లో కొత్తగా నిర్మించిన మండేపల్లి గంగపుత్ర సంఘం కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలోఆదివారం కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు కార్పొరేటర్‌ను సన్మానించారు.

గంగమ్మ గుడి నిర్మాణానికి సహకరించాలి

గోల్నాక డివిజన్ గంగానగర్‌లో కొత్తగా నిర్మించిన మండేపల్లి గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లి గుడి నిర్మాణానికి సహాయ, సహకారాలు అందించాలని ఆ సంఘం ప్రతినిధులు కేంద్రమంత్రికి వినతి పత్రం అందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం: రాజేంద్రనగర్‌లోని కృషి పాఠశాలకు చెందిన 1999 సంవత్సరంలో చదివిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి తమకు బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. అనంతరం ఒకరికొక్కరు తమ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. - మణికొండ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కాచిగూడ: రాబోయే తరాలకు పచ్చదనాన్ని ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఎఫ్‌సీసీ క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి శ్రీహరిచారి అన్నారు. ఎఫ్‌సీసీ క్లబ్ ఆధ్వర్యంలో వృక్షరోపన్ దివాస్‌లో భాగంగా ఆదివారం వీరన్నగుట్ట శివాలయంలో అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గొట్టాల వినోద్ చారి, ప్రతినిధులు మొక్కలను నాటి, స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ.. ఇంటికో మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

టిఫిన్ సెంటర్‌లో గ్యాస్ సిలిండర్లు చోరీ

వెంగళరావునగర్, ఆగస్టు 11:టిఫిన్ సెంటర్‌లో గ్యాస్ సిలిండర్లు చోరీకి గురైన ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టిఫిన్ సెంటర్ తాళాలు పగులగొట్టి గ్యాస్ సిలిండర్లు అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం..ఎల్లారెడ్డి గూడ జయ్‌ప్రకాశ్‌నగర్‌కు చెందిన యాదగిరి(45) అలీ నగర్‌లో వైష్ణవి టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున ఇద్దరు దొంగ లు టిఫిన్ సెంటర్ స్టోర్ రూమ్ తాళాలు పగలగొట్టి లోపలికి జొరబడ్డారు. నాలుగు వాణిజ్య సిలిండర్లను చోరీ చేసి ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దేశాభివృద్ధిలో.. భాగస్వాములు కావాలి

కాచిగూడ : విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఓయూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. రాములు అన్నారు. బద్రుక కళాశాల కామర్స్ అండ్ ఆర్ట్స్(బీసీసీఏ), బద్రుక ఎడ్యుకేషనల్ సొసైటీ(ఎస్‌జీజీబీఈఎస్)ఆధ్వర్యం లో నయోనరా-24 పేరుతో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రాములు హాజరయ్యారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి పెన్నార్ ఇండస్ట్రీస్ సీఎఫ్‌వో శ్రీకాంత్ భక్కడ్, కళాశాల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక, డైరెక్టర్ జనరల్ అభిరామ కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

'ఖాళీలు భర్తీ చేయాలి'

సుల్తాన్‌బజార్,ఆగస్టు 11 : 35 సంవత్సరాలుగా పౌర గ్రంథాలయాలలో ఎటువంటి ఉద్యోగ నియామకాలు జరుగలేదని, ప్రస్తుత జాబ్ క్యాలెండర్‌లో ఖాళీలను భర్తీ చేయాలని తెలంగాణ లైబ్రరీ స్టూడెంట్స్ అసోసియేషన్, లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అభ్యర్థులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఆదివారం అప్జల్‌గంజ్‌లోని రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయం ఆవరణలో రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళిని తెలంగాణ లైబ్రరీ స్టూడెంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఆకుల సాయిలు, భార్గవ్, రమేశ్, శంకర్, సత్యనారాయణ కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 35 ఏండ్లనుంచి పౌర గ్రంథాలయాలలో ఉద్యోగ నియామకాలు జరుగలేదని ఉద్యోగ ఖాళీలను 800-1000 పోస్టులకి తగ్గకుండా నోటిఫికేషన్ జారీ చేసే విధంగా సహాయ సహకారాలు అందించాలన్నారు.

ప్రజాపాలనలో.. దుస్థితి

రహదారులపై మురుగునీరు పట్టించుకోని అధికారులు

పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ నుంచి జనప్రియ వెళ్లే రహదారిపై రెండు వారాలుగా డ్రైనేజీ నీరు వరదలా రోడ్డుపై ప్రవహిస్తుంది. సమస్యను పరిష్కరించాలని అధికారులను, సిబ్బందిని కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీగా లీకేజీ కావడంతో రోడ్డుపై కిలోమీటర్ మేర మురుగు నీరు ప్రవహిస్తుందని ఈ దారి గూండా వెళ్లేందుకు అనేక అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పక్కనే దేవాలయం, పాఠశాలలు ఉన్నాయని విద్యార్థులు, భక్తులు సైతం మురుగునీటిలో నుంచే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మురుగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - మైలార్‌దేవ్‌పల్లి

ఆకర్షించేలా..! బంతిపూల వనం.. పిటోనియ పూలతో అటు సందర్శకులను..ఇటు వాహనదారులను ఆకర్షిస్తున్నది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పీవీమార్గ్‌లో పీవీ విగ్రహానికి ఎదురుగా ఉన్న ఈ ప్రకృతి వనం దర్శనమిస్తున్నది.-ఖైరతాబాద్

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

నృత్య దీక్షాలయం ఏడవ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాట్య గురువు డాక్టర్ పి.రమాదేవి, డాక్టర్ అనుపమ కైలాస్ విచ్చేశారు. నృత్య దీక్షాలయం సాంస్కృతిక సంస్థ విద్యార్థినులచే కూచిపూడి నృత్యాన్ని వైభవంగా నిర్వహించారు. - రవీంద్రభారతి

అంబేద్కర్ ఆశయాలను సాధించాలి

అంబేద్కర్ విగ్రహం ఎదుట కేక్ కట్ చేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

ఎర్రగడ్డ, ఆగస్టు 11: అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బోరబండలోని బాబాసాహెబ్ విగ్రహానికి పుష్పాంజలి కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నారు. ఈ ఆదివారం 100వ వారం కావడంతో వీకర్‌సెక్షన్ అంబేద్కర్‌నగర్ చౌరస్తాలోని బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల సమర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఏడీ మధు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు మనమందరం కట్టుబడి ఉండాలన్నారు. తెలంగాణ నూతన సచివాలయానికి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అంబేద్కర్ పేరు పెట్టడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రతి ఆదివారం ఈ పుష్పాంజలి కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మధుతో పాటు సంఘం నాయకులు డి.లక్ష్మయ్య, వెంకటాద్రి, పరమేశ్, కుమార్, మధుసూదన్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్లో దొంగతనం

కాచిగూడ : మైసూర్‌రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన భాస్కర్‌రావు భార్య రత్నకుమారి మైసూర్‌రైల్లో కాచిగూడకు ఆదివారం వచ్చారు. తన బ్యాగును చూసుకునే సరికి 13 తులాల బంగారు ఆభరణాలు, ఖరీదైన ఫోన్ కనిపించ లేదు.

అవి దొంగతనానికి గురైనట్లు గుర్తించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ దేవేందర్ తెలిపారు.